ప్రజాశక్తి

గురువారం 13 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

బదిలీలు..పైరవీలు

- పౌర సరఫరాల శాఖలో అవినీతి తిష్ట
- కాసుల వసూలుకు కేడర్ల వారీగా టార్గెట్లు


ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ఫార్సుగా మారుతున్నాయి. సొంత ఆదాయ వనరులను పెంచుకుంటున్న కొందరు అవినీతి అధికారులు యథా స్థానాల్లో కొనసాగేందుకు పైరవీలు చేస్తున్నారు. బదిలీ అయినా కూడా ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని అక్కడి నుండి కదలకుండా అవే స్థానాల్లో తిరిగి కొనసాగిపోతున్నారు. గత ఏడాది అక్టోబర్లో పౌర సరఫరాల సంస్థలో జరిగిన బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 అక్టోబర్లో జరిగిన బదిలీల్లో



పౌరసరఫరాల సంస్థకు జిల్లా అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే నూతన అధికారి బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించక ముందే ఆ ఉత్తర్వులు నిలిచిపోయాయి. గతంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికే తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆఘమేఘాల మీద మరో ఉత్తర్వును పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులు విడుదల చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. పెద్దఎత్తున పైరవీలతోనే సదరు అధికారి డిఎస్ఒ అదనపు బాధ్యతలు తిరిగి తన చేతుల్లోకి తీసుకోగలిగారనే ప్రచారం జరుగుతోంది.

కృష్ణాజిల్లాలో ప్రతిఏటా 6 లక్షల టన్నులకుపైగా ధాన్యం సేకరణ జరుగుతుంది. జిల్లాలో 160 కిపైగా రైస్ మిల్లులున్నాయి. ప్రజా పంపిణీని పర్యవేక్షించడంతోపాటు రైస్ మిల్లుల యజమానులతో బ్యాంక్ గ్యారెంటీలను కట్టించడం, ధాన్యం సేకరణలో రైస్ మిల్లులకు లక్ష్యాన్ని నిర్దేశించడం తదితర వ్యవహారాల్లో పౌర సరఫరాల శాఖ కీలకంగా వ్యవహరిస్తోంది. రైస్‌మిల్లులను పర్యవేక్షించి అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై ఆ శాఖ కేసులు నమోదు చేయాలి. గత రెండేళ్లుగా కొందరు రైస్ మిల్లర్ల అక్రమాలు తీవ్ర స్థాయికి చేరాయనే చర్చ సాగుతోంది. ధాన్యం మరపట్టిన తర్వాత సకాలంలో బియ్యం అందించకున్నా (మిగతా 2లో)



సిఎం చంద్రబాబుతో ఎంపి కేశినేని శివనాథ్ తదితరులు వార్త 2లో

సిఎంను కలిసిన ఎంపి శివనాథ్



ఎగ్జిబిషన్లో దగ్ధమవుతున్న షాపులు

అగ్నిప్రమాదంలో 13 షాపులు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం
- ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ : విద్యాధరపురం సితారా సెంటర్లో ఏర్పాటు చేసిన కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల వరకు ఆస్తినష్ట జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఎగ్జిబిషన్లో భారీగా ఎగిసి పడిన మంటలను మొత్తం ఆరు అగ్నిమాపక యంత్రాలతోసిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. విజయవాడ నగరంలోని కొత్తపేట, అజిత్‌సింగ్‌నగర్, ఆటోనగర్, బస్టాండ్‌తోపాటు కంచికచర్ల, మైలవరం నుండి వచ్చిన సుమారు 25 మంది అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలకుపైగా శ్రమించారు. ముగ్గురు జిల్లా స్థాయి అగ్నిమాపక అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా అగ్నిమాపక అధికారి ఎ.వి.శంకరరావు, విజయవాడ నగర పాలక సంస్థ అగ్నిమాపక అధికారి మాల్యాద్రి, రీజనల్ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావుతోపాటు జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి కె.వినయ్, కొత్తపేట, ఆటోనగర్, కంచికచర్ల ఫైర్‌స్టేషన్ల అధికారులు పి.శ్రీనివాసరావు, (మిగతా 2లో)

సిఎంను కలిసిన ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ

అమరావతి రాజధానిలో ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీకి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌లను ఉండవల్లిలోని వారి నివాసంలో బుధవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), శాప్ చైర్మన్ రవినాయుడు కలిశారు. ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) నేతత్వంలో పాపుల్యాస్ గ్లోబల్ ఆర్కిటెక్స్ ప్రతినిధి సిద్ధార్థ్, ఎన్.వి.ఆర్కిటెక్స్ ప్రతినిధి వెంకట్, ఐబిఎస్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ కన్సల్టేషన్స్ కంపెనీ ఎమ్‌డి వడ్లమూడి హర్ష తదితరులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను కలిశారు.



ఎంపి శివనాథ్‌ను కలిసిన ఎపి ఫైబర్ నెట్ చైర్మన్

ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపిని కలిశారు.

28 వరకు అపరాధ రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్సులు వసూలు

ప్రజాశక్తి - విజయవాడ

2025 -2026 సంవత్సరాలకుగాను ట్రేడ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవాలని వ్యాపారులందరికీ నోటీసులు ఇచ్చామని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుండి 28వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా నగరపాలక సంస్థకు సంబంధించిన వివిధ కౌంటర్లలో లైసెన్సు రుసుము కట్టించుకుంటున్నట్లు తెలిపారు. డిమాండ్ నోటీసును సంబంధించిన సచివాలయాల్లో రెన్యువల్ చేయించుకుని లైసెన్స్‌కి చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 1 నుండి 31వ తేదీ వరకు చెల్లించే వారు అపరాధ రుసుము కింద లైసెన్సు ఫీజు రుసుములో 25 శాతం అపరాధ రుసుముగా చెల్లించాలని, ఏప్రిల్ 1 నుండి చెల్లించే వారు లైసెన్సు ఫీజులో 50 శాతం అపరాధ రుసుముగా చెల్లించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 28వ తేదీలోపు లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.



బదిలీలు...పైరవీలు...

(మొదటి పేజీ తరువాయి)

చూసీచూడనట్లు అధికారులు వ్యవహరించారు. ధాన్యం సేకరణ మొదలు బియ్యం తరలింపు వరకు అంతటా అవినీతికి దార్లు తెరుచుకున్నాయి. రైతులు సేకరించిన ధాన్యం మరబట్టిన తర్వాత బియ్యం సకాలంలో తిరిగి ప్రభుత్వానికి అందించకపోయినా అరకొరగా నామమాత్రపు కేసులు నమోదు చేసి సరిపెట్టారనే విమర్శ ఉంది.

బదిలీల్లో పైరవీలు

రెండేళ్లక్రితం పౌరసరఫరాల శాఖ డివిజన్‌స్థాయి అధికారికి పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా అధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యాలయంలో ఉద్యోగులు నిర్వహించే స్థానాలను మార్పు చేసి, కేడర్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మరీ అక్రమ వసూళ్లను ప్రోత్సహిస్తున్నారనే విమర్శ ఉంది. గత ఏడాది అక్టోబర్లో జరిగిన బదిలీల్లో ఎక్కడైతే జిల్లా అధికారిగా (డిఎస్ఒ) బాధ్యతలు నిర్వహించారో అదే కార్యాలయంలో సహాయ అధికారిగా (ఎఎస్‌వో) బాధ్యతలు అప్పగిస్తూ ఈ పోస్టులో నూతన డిఎస్ఒను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. సదరు అధికారి విధుల్లోకి రాకముందే మరోచోటుకు బదిలీ కావడం చర్చనీయాంశమైంది. అదనపు బాధ్యతల్లో గత అధికారినే తిరిగి జిల్లా అధికారిగా నియమించారు. ఈనేపథ్యంలోనే సదరు శాఖలో పెద్దఎత్తున పైరవీలు సాగుతున్నాయని, నగదు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.



కాలిపోయిన దుకాణాలు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదంలో 13 షాపులు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

కె.నరేష్, పి.కృష్ణమూర్తి సంఘటనలో స్థలంలో ఉండి మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. ఈ ఎగ్జిబిషన్లో సుమారు 25 స్టాళ్లు ఉండగా, 13 స్టాళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ స్టాళ్లలో పిల్లల ఆటవస్తువులు, గాజులు, బొమ్మల రిమోట్ కంట్రోల్ వస్తువులు, డ్రైఫ్రూట్స్, బట్టలు, స్టీల్ సామాన్లు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి.

ప్రమాదంపై ఆరాతీసిన హోంమంత్రి

అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆరా తీశారు. ప్రాణ, ఆస్తి నష్టం ఏమైనా జరిగిందా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడుతో వ్యాపించిన మంటలను అదుపులోకి తెచ్చినట్లు పోలీస్, అగ్నిమాపక అధికారుల వెల్లడించారు. ఎండలు మొదలైన నేపథ్యంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని హోం మంత్రి సూచించారు. విజయవాడ వెస్ట్ డివిజన్ ఎసిపి ఎన్ఎస్వీకే దుర్గారావుతో ఆమె ఫోన్లో మాట్లాడారు.



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర

అగ్నిప్రమాద ఘటనపై చర్యలు

ముగ్గురు విఎంసి అధికారులకు కమిషనర్ నోటీసులు

విద్యాధరపురం సితార సెంటర్లో కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదం పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పలువురు అధికారులపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చర్యలు తీసుకున్నారు. నగర పాలక సంస్థ ఎస్టేట్ ఆఫీసర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్, జోనల్ కమిషనర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా అనుమతులు ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రమాద ప్రాంతాన్ని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై సమీక్షించారు. సంఘటనా స్థలాన్ని పశ్చిమ తహశీల్దారు షేక్ ఇంతియాజ్ పాషా తదితరులు పరిశీలించారు.



పేలిన గ్యాస్ సిలిండర్లు

ఆలపాటి గెలుపు కోరుతూ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ

ఉమ్మడి కష్ణా - గుంటూరు జిల్లాల ఎన్డీయే కూటమి బలపరిచిన ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఆత్మీయ సమావేశం జరిగింది. టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు గద్దె, బోండా, తంగిరాల, వసంత, కొలికపూడి, శ్రీరామ్ రాజగోపాల్, ఎంఎల్‌సి అశోక్ బాబు, బిజెపి, జనసేన జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, సామినేని ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్‌ఎలు, ఎంపి, టిడిపి నేతలు

14 నుండి చేనేత, హస్త కళల ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 14వ తేదీ నుండి గ్రామీణ్ భారత్ మహోత్సవ్- ఆంధ్రప్రదేశ్-2025"లో భాగంగా విజయవాడలో హస్త కళలు, చేనేత ప్రదర్శన జరగనుంది. నగరంలోని నాబార్డ్ రాష్ట్ర ప్రాంతీయ కార్యాలయం వారు ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా "గ్రామీణ్ భారత్ మహోత్సవ్- ఆంధ్రప్రదేశ్-2025" లో భాగంగా రాష్ట్ర స్థాయి చేనేత, హస్త కళల ప్రదర్శనను విజయవాడలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రీతం మారుతి జంగం బుదవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంప్రదాయ చేనేత, హస్తకళలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఆఫ్‌ఫార్మ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, నైపుణ్యం కలిగిన కళాకారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 23వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. టస్సర్ సిల్క్, గొల్లభామ చీరలు, గద్వాల్, మంగళగిరి చీరలు, లెదర్ షేడ్, ఏటికొప్పాక బొమ్మలు, నిజామాబాద్ నల్ల కుండలు, వారణాసి చెక్క లక్క సామాను మరియు బొమ్మలు వంటి వివిధ రకాల ప్రత్యేకమైన కళాఖండాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పర్వతనేని విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్వతనేని జగన్‌మోహన్‌రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుడివాడ : ఎన్‌టిఆర్ స్టేడియం నిర్మాణంలో పర్వతనేని జగన్‌మోహన్‌రావు చేసిన కృషి మర్చిపో లేదని కమిటి ఉపాధ్యక్షా, సంయుక్త కార్యదర్శులు యలవర్తి శ్రీనివాసరావు, కిలారపు రంగప్రసాద్‌లు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో పర్వతనేని జగన్‌మోహనరావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్టేడియం నిర్మాణానికి చేసిన కృషిని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పర్వతనేని ఆనంద్, స్టేడియం మేనేజర్, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణానది కరకట్టలను పటిష్టం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణానది కరకట్టలు సత్వరమే పటిష్టం చేయాలని వైసిపి అభిమాని యువనేత బడే గౌతం కోరారు. బుధవారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం కృష్ణానదికి సంభవించిన వరదల సమయంలో దివిసీమలోని లంక గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారిన సంగతి అందరికీ తెలుసన్నారు. వరదల సమయంలో దివిసీమ ప్రాంతంలో కృష్ణా నది కరకట్ట ఎప్పుడు ఎక్కడ తెగిపోతుందోనని ఈ ప్రాంత ప్రజలు వరద తగ్గుముఖం పట్టేంతవరకు నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. అలాంటి ఉధతస్థాయిలో కష్ణా నదికి మరొకసారి వరదలు సంభవిస్తే పటిష్టంగా లేని కరకట్టల వలన దివిసీమ ముఖచిత్రమైన మారిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. అందువల్ల వరదల సమయంలో కరకట్టాల పటిష్టం చేయటం కోసం కూటమి ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతుందని ప్రజలకు హామీ ఇవ్వడమే కాక ఎన్నికల ముందు కూడా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కరకట్టపై పాదయాత్ర కూడా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కరకట్ట పటిష్టత కోసం ఆలోచన చేయకపోవడం దురదష్టకరమని, అందువల్ల ప్రకతి వైపరీత్యాలు ఎప్పుడు ఎలా సంభవిస్తాయో ఊహించలేం కాబట్టి ముందుగానే జాగ్రత్తలు తీసుకొని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కరకట్టాలను ప్రతిష్టపరిచే విధంగా చర్యలు చేపట్టాలని గౌతం డిమాండ్ చేశారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలో వ్యవసాయ శాఖ కు సంబంధించిన విజిలెన్స్ అధికారులు ఎరువుల షాపులపై బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు కమిషన్ ఆఫీసులో పనిచేయు చున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఏ మదులేటి వ్యవసాయ శాఖ అధికారి విఎస్ సురేష్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పులిగడ్డలోని ధరణి ట్రేడర్స్ షాప్ పై తనికి నిర్వహించగా పట్టేసావా అందులో 912.82 కేజీల/లీటర్లకు సంబంధించిన వివిధ పురుగుమందులకు సంబంధించిన తగిన ధ్రువీకరణ పత్రాలు, స్టాక్ పుస్తకాలు బిల్లు పుస్తకాలు లేనందువలన షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఎరువులు పురుగుమందుల షాపుల యజమానులు రికార్డులు సక్రమంగా నిర్వహించని ఎడల కిమి సంహారక చట్టం 1968 రూల్ 1971 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు జేఎస్ జయప్రద, మండల వ్యవసాయ శాఖ అధికారి వి శౌరమ్మ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెంచాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తూ పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరిగేలా సాయుధ బలగాల పనితీరు ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన 'డీ మొబలైజేషన్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లా డుతూ ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న శిక్షణ అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ డిమొబి లైజేషన్ దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వి.వి. నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ , ఆర్ఐలు కె.రవి కుమార్, వై.రవి కిరణ్, ఎం. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

కెఎస్ లక్ష్మణరావు విజయం కోరుతూ ప్రచారం



ఓ ప్రైవేటు విద్యాసంస్థల వద్ద ఓట్ల అభ్యర్థిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 27వ తేదీన జరగనున్న జరగనున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అవనిగడ్డలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజాసంఘాలు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. బుధవారం అవనిగడ్డలోని వివిధ కార్యాలయాలు, ప్రైవేట్ మేనేజ్మెంట్ పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని కలసి నిరుద్యోగ సమస్యలపై పోరాడే లక్ష్మణరావు గెలిపించుకోవాలని నిరంతరం ఆయన ప్రజల కోసమే పనిచేస్తారని అందువల్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు నిరుద్యోగులు ఆయన గెలుపుకు సహకరించి మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ముద్రాపు పోలినాయుడుతోపాటు పలువురు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో తనిఖీ చేస్తున్న దృశ్యం

మాంసం దుకాణాల్లో తనిఖీ



నాగాయలంక మండలంలో...

ప్రజాశక్తి -నాగాయలంక : బర్డ్స్ ఫ్లూ ఉన్న ప్రాంతాల నుంచి కోళ్లను, గుడ్లను సరఫరా చేయరాదని మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి సాయి మౌనిక మాంసం దుకాణాల దారులను హెచ్చరించారు. బర్డ్స్ ఫ్లూ విస్తరిస్తున్న తరుణంలో ఆమె బుధవారం నాగాయలంక లోని పలు కోడి మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. ముందస్తు జాగ్రత్తలను వారుకి సూచించారు. ప్రభావిత ప్రాంతాల నుంచి కోళ్లను, గుడ్లను తీసుకొచ్చి విక్రయించరాదని ఆమె సూచించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఇతర జిల్లాల నుండి బాయిలర్ కోళ్లను కొనుగోలు చేసి మాంసాన్ని అమ్మ రాదని చికెన్ షాప్ యజమానులకు కార్యదర్శి ఎజేఎల్ నరసింహారావు బుధవారం తెలిపారు. కోళ్లకు వస్తున్న వ్యాధుల కారణంగా గ్రామంలో ఎవరూ కూడా కోడి మాంసాన్ని తినరాదని కోరారు. చికెన్ షాప్ యజమానులకు గురువారం పంచాయితీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి బుధవారం తెలిపారు



దీక్షలకు మద్దతు తెలిపుతున్న నాయకులు

వెటర్నరీ విద్యార్థుల దీక్షకు మద్దతు

ప్రజాశక్తి-గన్నవరం : మెడికల్ విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కాలేజీ విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ గత పది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరికి సంఘీభావంగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, ఏ ఐ వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్, జి, పరుచూరి రాజేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

భక్తులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఈనెల 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్న ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్ళకు నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకునేందుకు తరలివస్తున్న తరుణంలో భక్తులకు మండల ప్రజా పరిషత్ ఉయ్యూరు తరుపున అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజు 12:30 గంటల నుండి ఏదో ఒక అల్పాహారం (పులిహెూర, ఉప్మా, దద్ధోజనం, కొబ్బరి అన్నం, చక్కర పొంగలి) తోపాటు తాగు నీరు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ శేషగిరి రావు తెలిపారు.

ఆయుర్వేదంతో అనారోగ్యాలు దూరం

- ఆయుష్ జోన్-2 రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కల్పనా కటాక్షం

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఆయుర్వేద వైద్యుల సూచనలు సలహాలు పాటించడం ద్వారా ఎలాంటి అనారోగ్యానైనా జయించవచ్చని ఆయుష్ జోన్ 2 రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి కల్పనా కటాక్షం అన్నారు. బుధవారం మండలంలోని తేలప్రోలు ఆయుష్మాన్ ఆయుర్వేద వైద్యశాల లో కీర్తిశేషులు శేబీ మోదుగు సూర్య నారాయణ, రాజారత్నం సుగణమ్మల జ్ఞాపకార్ధం వారి కుమారుడు మోదుగు బాను సుందర్ కుమార్ దాతృత్వంతో నిర్మితమైన మరుగుదొడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కల్పనా కటాక్షం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లక్ష్మి సౌజన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏ విధమైన అనారోగ్యానైనా నయం చేయగలిగే శక్తి ఆయుర్వేద వైద్యానికి ఉన్నదని, దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వైద్యశాలలో పంచకర్మ చికిత్సలను అందిస్తున్నామని చెప్పారు. దాత బాను సుందర్ కుమార్ మాట్లాడుతూ సమాజం బాగుంటే అందరూ బాగుంటారని తన తండ్రి సూర్యనారాయణ చెప్పిన మాటలే ఈ దాతృత్వానికి కారణం అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ లాం థిభోరా, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మరుగుదొడ్లు ప్రారంభిస్తున్న దృశ్యం

తెలుగు మాధ్యమంలో కలపొద్దని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : కృత్తివెన్ను మండలంలోని చిన్న పండ్రాక గ్రామంలో ఉర్దూ పాఠశాలను తెలుగు మధ్యమానికి అనుసంధానం చేయకూడదని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్ ను కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి విద్యార్థులకు ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వివాదాలకు నిలయంగా కస్తూర్బా గాంధీ విద్యాలయం

- ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది మధ్య కోల్డ్‌వార్
- ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- తిరువూరు ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-ఎ.కొండూరు: కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు, అనాథ పిల్లలకు, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో స్థాపించిన ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ విద్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. ఈ పాఠశాల స్థాపించిన నాటినుండి ఏదో ఒక వివాదంతో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ జరుగుతూనే ఉంది. ప్రస్తుతం ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు కొద్ది రోజుల్లోనే పబ్లిక్ పరీక్షలు ఉండగా ఇంటర్ బోధనా సిబ్బందికి, విద్యాలయ ప్రిన్సిపాల్ కు మధ్య వివాదాలు చోటు చేసుకోవడంతో ఒకరిపై ఒకరు విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాటు, జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ కు, తిరువూరు ఆర్డీవో కె.మాధురి కి ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం తిరువూరు కె.మాధురి సుమారు ఆరు గంటల పాటు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యాలయంలో విచారణ చేపట్టారు. బోధన సిబ్బంది ప్రిన్సిపాల్ పై మెనూ ప్రకారం బాలికలకు భోజనం పెట్టడం లేదని, ఇంటర్మీడియట్ చదువుతున్న కొందరు బాలికలను తనకు అనుకూలంగా మలచుకొని బాలికలను క్రమశిక్షణగా ఉంచాలని చూస్తున్న తమను అడ్డుకుంటున్నారని, ఇంటర్ విద్యార్థులను ప్రిన్సిపాల్ రాత్రి సమయాల్లో తన వెంట బయటకు తీసుకు వెళుతున్నారని, ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని బోధన సిబ్బంది ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్ తనకు అనుకూలంగా మలుచుకున్న బాలికల తల్లిదండ్రులతో, బోధన సిబ్బందిని దుర్భాషలాడినట్లు కూడా పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదులో బోధన సిబ్బంది పేర్కొన్నట్లు తెలిసింది. అయితే ప్రిన్సిపాల్ బోధన సిబ్బంది బాలికలకు నాణ్యమైన విద్యను బోధించడం లేదని, బాలికలను క్రమశిక్షణలో ఉంచడంలో విఫలమవుతున్నారని, విద్యాలయములో జరుగుతున్న వివాదాలకు బోధనా సిబ్బందే కారణమని, విద్యాలయంలో జరిగిన విషయాలను బోధన సిబ్బంది బయటకి చెబుతున్నారని ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆర్డీవో మాధురి సమగ్ర విచారణ జరిపినట్లు బాలికల తల్లిదండ్రుల ద్వారా తెలుస్తోంది. ఈ విద్యాలయం నిత్యం ఏదో ఒక వివాదంతో కొట్టుమిట్టాడు తోనే ఉంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారు, బాలికలకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది పోయి, అనవసర వివాదాలతో బాలికల భవిష్యత్తు ఆటలాడుకుంటున్నట్లు బాలికల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అలానే ప్రిన్సిపాల్ కూడా మెనూ ప్రకారం బాలికలకు నాణ్యమైన భోజనం అందించటం లేదనే విమర్శలు కూడా బాహాటం గాని వినిపిస్తున్నాయి. పిల్లలకు భోజనం వడ్డించే విషయం పై గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ ఆకస్మికంగా జరిపిన తనిఖీలు బాలికలు తమకు నాణ్యమైన భోజనం వడ్డించటం లేదని ఛైర్మన్ దష్టికి బాలికలు తీసుకు వెళ్లినట్లు కూడా బాలికల తల్లిదండ్రులు చెబుతున్నారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ ప్రిన్సిపాల్ తో పాటు మరికొందరు సిబ్బందిని మందలించినట్లు తెలిసింది. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు కూడా ఏ విషయంలో కూడా అక్కడ ఎలాంటి మార్పు రాలేదని, పదవ తరగతి ఇంటర్, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం తగ్గుతుందే తప్పా మెరుగు పడటం లేదని బాలికల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన ఈ విద్యాలయం వివాదాలకు కేంద్రంగా మారటం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న బాలికల కొరకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఫలితం మాత్రం శూన్యంగా ఉందని, ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పిల్లలను చేర్పించాలంటే బాలికల తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు, జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలలో నెలకొన్న వివాదాలపై దష్టి సారించి బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.





చేతన ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నెహ్రూ నగర్ కమ్మ కళ్యాణ మండపంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేతి వత్తిపై ఆధారపడి పని చేసే వారికి బాసటగా నిలిచారు. చిరు వ్యాపారాలు నిర్వహించుటకు 40 తోపుడు బళ్ళు, 10 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 10 గ్రైండర్స్ చేతన ఫౌండేషన్ ద్వారా చేత ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగండ్ల రవికుమార్ మంగళవారం నందిగామలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మైలవరం ఎంఎల్‌ఎ వసంత కష్ణ ప్రసాద్, నందిగామ మున్సిపల్ ఛైర్మన్ మండవ కష్ణ కుమారి చేతుల మీద అర్హులైన పేద చిరు వ్యాపారస్తులకు తోపుడు బళ్ళు కుట్టు మిషన్ గ్రైండర్ అందజేశారు. చేతన ఫౌండేషన్ సంస్థ ద్వారా సమాజంలో మరిన్ని సేవలు నిర్వహించటానికి ముందడుగు వేస్తున్నారని తెలిపారు. చేతన ఫౌండేషన్ ద్వారా కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. చాలామంది ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలేటి సతీష్, వాసిరెడ్డి ప్రసాద్, వాసిరెడ్డి సత్య నారాయణ ప్రసాద్, పెండ్యాల వీరభద్రరావు పాల్గొన్నారు.


16న జనసేన సమావేశాన్ని విజయవంతం చేయాలి : సామినేని

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ జనసేన పార్టీ ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుల కార్యకర్తలతో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 16వ తేదీన విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని జనసేన నేతలు విజయవంతం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి లక్ష్మి, మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, సెంట్రల్ ఆంధ్ర ప్రచారకమిటీ సభ్యులు యర్రంశెట్టి నాని, రూరల్ మండలం అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.



చికెన్ వ్యాపారులకు నోటీసులు

ప్రజాశక్తి-గంపలగూడెం: కనుమూరు, అనుములంక గ్రామాలలో చికెన్ షాపుల్లో చికెన్ అమ్మకాలు చేయొద్దంటూ షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం అనుములంక గ్రామంలో ఓ పౌల్ట్రీ ఫారంలో 12 వేలకు పైగా కోళ్లు బర్డ్ ఫ్లూతో మృత్యువాత పడగా, పంచాయతీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై కార్యదర్శి మరీదు హరి చికెన్ షాప్ లో యజమానులకు నోటీసులు జారీచేసి, అమ్మకాలు కొనుగోళ్లు జరపరాదన్నారు. పది కిలోమీటర్ల పరిధిలో ఇటువంటి లావాదేవీలు జరిగితే చర్యలు చేపడతామని ఆ నోటీసులో పేర్కొన్నారు.



కోళ్ల ఫారం యజమానికి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-గంపలగూడెం: అనుములంక గ్రామంలో అత్తునూరి పద్మా రెడ్డికి చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో 12 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడినట్లు ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం కోళ్ల ఫారాన్ని ఆయన పరిశీలించారు. రూ.35 లక్షలకు పైగా ఆ రైతు నష్టపోయినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకు వీరారెడ్డి, గువ్వల సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



ముగ్గురి ప్రాణాలు నిలబెట్టిన అవయవదానం

- రోడ్డు ప్రమాదంలో కోటేశ్వరరావుకు గాయాలు
- అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబసభ్యులు
- గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

తాను మరణిస్తూ మరో ముగ్గురికి ప్రాణం పోసిన ఓ వ్యక్తి.. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు. అవయవ దానం ద్వారా ముగ్గురికి పునర్జన్మనిచ్చి, చిరంజీవి అయ్యాడు. ఈ నెల 5వ తేదీన కష్ణాజిల్లాలో బంటుమల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుద్దన కోటేశ్వరరావు (54) తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో స్పహ కోల్పోయిన కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం తాడిగడపలోని కామినేని హాస్పిటల్స్‌కు తీసుకొచ్చారు. కామినేని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ పేషెంట్ బ్రెయిన్ డెడ్ అయినట్లు గా వైద్యులు నిర్ధారించారు. మరణించిన తమ కుటుంబసభ్యుడిని చిరంజీవిగా నిలపాలనే కామినేని హాస్పిటల్ వైద్యుల సలహామేరకు సత్ సంకల్పంతో కోటేశ్వరరావు కుటుంబసభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. జీవన్ దాన్ నిబంధనల మేరకు కిడ్నీలు (మూత్రపిండాలు), లివర్ (కాలేయం) సేకరించిన కామినేని వైద్యులు.. గ్రీన్ ఛానల్ ద్వారా అవసరమైన చోట్లకు తరలించారు. కామినేని క్లస్టర్ హెడ్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ ఉయ్యూరు శ్రీధర్, డాక్టర్ రాంబాబు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



మారథాన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో దేశవ్యాప్తంగా 1576 టీమ్‌లు, వాటిలో జగ్గయ్యపేట డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూల్ నుండి ఆరు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత తెలిపారు. ఏటియల్ ఇంచార్జ్ కారిచర్ల శ్రీదేవిని, ఏటియల్ మెంటర్ కె. రాజీవ్ విద్యార్థులను అభినందించారు.

16న చిత్రలేఖనం పోటీలు

విజయవాడ: అమరావతి బాలోత్సవం, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్ సౌజన్యంతో చార్లెస్ డార్విన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక వివేకానంద హైస్కూల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వి.రమేష్‌బాబు, కె.బాలుడు, పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ పరిధిలోని స్కూల్ విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. పోటీలు సబ్ జూనియర్స్ (2, 3, 4 తరగతులు) మీకు నచ్చిన పక్షి, జూనియర్స్ (5, 6, 7 తరగతులు) ప్రకతి దృశ్యం, సీనియర్స్ (8, 9, 10 తరగతులు) పల్లె వాతావరణం అంశాలపై జరుగుతాయని, పోటీ జరిగే కేంద్రంలో డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇస్తామని, మిగిలిన మెటీరియల్ మొత్తం చిత్రకారులే తమ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విజేతలకు మెమెంటోలు, పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. 14వ తేదీలోపు పాల్గొనే వారి వివరాలు 9603457705, 9666845373 నెంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఎఎన్‌యు సైకాలజీ బోర్డు మెంబర్‌గా ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైకాలజీ పీజీ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా ప్రముఖ మనస్తత్వ శాస్త్రవేత్త, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి ప్రసాద్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైకాలజీ బోర్డు మెంబర్‌గా ప్రసాద్ బాబు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. సైకాలజీ విభాగంలో ప్రసాద్ బాబుకు ఉన్న విశేష అనుభవాన్ని పురస్కరించుకొని ఆయనను ఈ పదవిలో నియమించినట్లు పేర్కొన్నారు. మనోవికాస మార్గదర్శకత్వం, మనస్తత్వ విశ్లేషణ రంగాలలో ప్రముఖుడుగా పేరుపొందిన ప్రసాద్ బాబు సైకాలజీ పై 60 కి పైగా పుస్తకాలు రచించారు. ఉమ్మడి తెలుగు అకాడమీకి 25 కు పైగా పుస్తకాలు సైకాలజీ గురించిన వివిధ అంశాలపై రచించారు. తెలుగు అకాడమీ ప్రచురించిన డీఎస్సీ, టెట్ తదితర పోటీ పరీక్షలకు ఆయన రాసిన పుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలతో పాటు అనేక విశ్వవిద్యాలయాలకు పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ రచించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ప్రచురిస్తున్న కామన్ కోర్ బీఈడీ పాఠ్యపుస్తకాలకు సంపాదక మండలి సభ్యుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రసాద్‌బాబు నియామకం పట్ల పలువురు సైకాలజిస్టులు, విద్యావేత్తలు తమ హర్షం ప్రకటించారు.



సామ్‌సంగ్ ఫాస్ట్ ఛానళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శామ్‌సంగ్ టీవీ ప్లస్, శామ్‌సంగ్ యొక్క ఫ్రీ యాడ్-సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీసు, శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇండియాలో ప్రత్యేకంగా ఐదు కొత్త ఫాస్ట్ ఛానెళ్లను ప్రారంభించినట్లు సంస్థ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ కునాల్ మెహతా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డబ్ల్యూబీటీవీ ఛానెల్స్ అధిక నాణ్యత, ఉచిత వినోదం కోసం డిమాండ్‌ను తీర్చడం ద్వారా స్ట్రీమింగ్ ప్రేక్షకులకు ప్రీమియం కథను అందిస్తాయి అని తెలిపారు.. హిందీ కార్యక్రమాలపై బలమైన దష్టి సారించి, ఈ కొత్త ఫాస్ట్ ఛానెల్‌లు ప్రాంతీయ, పట్టణ ప్రేక్షకులను లీనమయ్యేలా చేయడానికి రూపొందించినట్లు చెప్పారు. విభిన్న శ్రేణి ప్రీమియం ప్రోగ్రామింగ్‌ను అందిస్తూ, శామ్‌సంగ్ స్మార్ట్ టీవీలు, మొబైల్ పరికరాల్లో వీక్షకులను ఆకర్షించడానికి ఈ చానెళ్లు రూపొందించినట్లు పేర్కొన్నారు.

అవనిగడ్డ-విజయవాడ కరకట్ట రోడ్డుపై

ప్రయాణం నరకం

• మధ్యలోనే ఆగిపోతున్న బస్సులు • ప్రయాణీకుల తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-మోపిదేవి : విజయవాడ నగరంలో ముఖ్యమైన పనులపై వెళ్లేవాళ్లుబస్సు ఎక్కిన తర్వాత గమ్యం చేరడానికి గ్యారెంటీ లేదన్నట్టుగా అవనిగడ్డ డిపో బస్సులు నిర్వహణ ఉందని ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బుధవారం విజయవాడలో బయలుదేరిన బస్సు మార్గమధ్యలో గేర్ రాడ్ విరిగిపోవడంతో బస్సు ఆగిపోయింది. బుధవారం విజయవాడ వెళ్తున్న ఓ బస్సు గేర్ రాడ్ విరిగిపోయి రివర్స్లో అద్దం వైపు తిరిగింది. డ్రైవర్ కంట్రోల్ చేయబట్టి సరిపోయింది కానీ అదే బస్సు అదుపుతప్పి ప్రమాదం జరిగితే ప్రయాణికుల పరిస్థితి ఏంటి? వారి భద్రత ఏంటి? అనే ప్రశ్నలు కు సమాధానం చెప్పే వాళ్లే లేరు. ఇలా ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగితే వ్యవస్థాగత లోపాలను బయటికి రాకుండా కప్పిపుచ్చుకొని తక్షణ చర్యగా ఆ డ్రైవర్ను డ్యూటీచార్ట్లో నుంచి పక్కన పెడతారు. ఇలాంటి సంఘటన అవనిగడ్డ డిపోలో సర్వసాధారణం అయిపోయాయి. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదానికి డ్రైవర్ బాధ్యత లేకపోయినా పనిష్మెంట్లు విధిస్తున్నారని గగ్గోలు పెడుతూ ఆత్మహత్యకు సైతం పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బుధవారం ఉదయం కరకట్టపై ఆగిపోయిన బస్సుల్లో ప్రయాణికులు ఇబ్బందులు వర్ణనాతీతం. బస్సు నిండా జనం వెనక వచ్చే బస్సు నిండా కూడా జనం వీళ్ళందర్నీ సర్దుబాటు చేయడానికి రెండు మూడు బస్సులు వచ్చేదాకా వేచి చూసిన ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. వాటిల్లో మళ్లీ ఇంకొక బస్సు ఆగిపోయింది. పోనీ కరకట్ట రోడ్డు బస్సులు వదిలేసి పామర్రు ఉయ్యూరు మీదగా వెళ్దాం అంటే ఆ రూట్లో బస్సులు తగ్గించేశారు. రోడ్డు అంతకన్నా మహా ప్రమాదకరంగా ఉంది. చల్లపల్లి నుంచి కొడాలి వరకు మొవ్వ నుంచి కూచిపూడి వరకు ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉండి ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని గుర్తుకు తెస్తూ ఉంటుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కరకట్ట బస్సులు ఆశ్రయించి విజయవాడ అవనిగడ్డ రోడ్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు ఏ బస్సు ఎక్కడ ఆగిపోయిన పర్వాలేదు అనుకుని మానసికంగా సిద్ధపడి ఎప్పుడుకోసారి గమ్యం చేరితే చాలులే అనుకునే దుర్భర పరిస్థితిలో ప్రయాణాలు చేస్తున్నారు. అవనిగడ్డ డిపోలో బస్సుల నిర్వహణ మరమ్మతులు సకాలంలో చేపించి ప్రయాణికుల కష్టాలను గట్టెక్కించాల్సిందిగా దివిసీమ ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


విరిగిపోయి ముందుకు వాలిన గేర్ రాడ్


రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణీకులు


రైతులను సన్మానిస్తున్న చలసాని ఆంజనేయులు

పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత : చలసాని

ప్రజాశక్తి-గన్నవరం : పాడి రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని కాకులపాడు పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘంలో కృష్ణా మిల్క్ యూనియన్ను స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదగా కేకు కట్ చేశారు. సంగంకు నిరంతరం పాలను సరఫరా చేసిన పాడి రైతులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలక వర్గ సభ్యులు, మేనేజర్ మాగంటి హరిబాబు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు .

గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి టికల్ సైన్స్ కళాశాల లో దివిస్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఈనెల 11వ తేదీ బీఫార్మసీ ఆఖరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో భాగంగా మొదటి దశలో రాత పరీక్షను రెండవ దశలో టెక్నికల్ ఇంటర్వ్యూ ను నిర్వహించారు. కళాశాల విద్యార్థులు దాదాపు 20 మందికి పైగా ఈ రెండు రౌండ్స్ లో విజయం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఏ లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులకు ప్రొడక్షన్, క్వాలిటీ ఎస్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగంలో శిక్షణ ఇచ్చి తగిన పోస్టుకు ఎంపిక చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణ్ రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి ఎస్కే నాగుల్ మీరావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యోగం సాధించిన వారికి అభినందనలు తెలియజేశారు.





హంసలదీవికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు : హంసల దీవి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కళ్యాణం మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగ ణంలో కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్ర హ్మణ్య అవధాని ఆధ్వ ర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ కుప్ప రామ గోపాల స్వామి యాజి దంపతులచే శాస్త్రోత్తంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు.

పోటెత్తిన హంసలదీవి సాగర తీరం

మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా హంస లదీవి పవిత్ర సింధూ స్నానాలు ఆచరించేందుకు హంసలదీవి సముద్ర తీరం వద్ద భక్తుల పోటెత్తారు. బుధవారం వేకువ జామ నుంచే వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు, తదితరులు

శంకర ఆస్పత్రి సేవలు అభినందనీయం :మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కంటి చూపు సంరక్షణ విషయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కొల్లు ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని లలితా కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు , జనసేన ఇంఛార్జి బండి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం అందించే లక్ష్యంతో ముందుకొచ్చిన శంకర ఐ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇప్పటికే 350కి పైగా క్యాంపులు నిర్వహించి దాదాపు నాలుగున్నర లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం, గుంటూరులో ఉన్న ఆస్పత్రిలో వైద్యం చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా కేటరాక్ట్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు ఉచితంగా సర్జరీలు కూడా చేయడం వారి సేవా భావానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో కొల్లు ఫౌండేషన్ ప్రతినిధి కొల్లు పునీత్ చంద్ర, ఫీనిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి చుక్కపల్లి అవినాశ్, శంకర కంటి ఆస్పత్రి ప్రతినిధి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు సలీం, అయ్యప్ప, సాయి కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాంచారమ్మ సంబరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురంలో శ్రీ లక్ష్మీ నాంచారమ్మ అమ్మవారి వార్షిక సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయాన్ని అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శివ సుబ్రహ్మణ్యం, వేద పండితులు శుద్ధపల్లి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి కోటేశ్వరరావు, అడుసుమిల్లి ఆంజనేయులు, అడుసుమిల్లి చంద్రశేఖర శాస్త్రి, పోపూరి చైతన్యకువ అమ్మవారి ఆశీస్సులు అందచేసి సత్కరించారు.

16న 10కె రన్

• ఎన్టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గుడివాడ : పర్వతనేని జగన్మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని స్టేడియం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదిన 10కె రన్ నిర్వహిస్తున్నట్లు ఎన్టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్లు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యలవర్తి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటలకు జగన్మోహనరావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో పురుషులకు 10కె రన్, అలాగే 6కె రన్ స్రీలకు, 4కె రన్ 12సంవత్సలలోపు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10కె రన్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.6,116లు, 2వ బహుమతిగా రూ.4,116లు, 3వ బహుమతిగా రూ.3,116లు, 4,5,6వ బహుమతులుగా రూ.1,116లు, 7,8,9,10వ బహుమ తులుగా రూ.516లు, 11 నుండి 15 వరకు ఒక్కొక్కరికి రూ.316లు అందిస్తామన్నారు.. 6కె, 4కె రన్లో ప్రతి ఒక్క విజేతలకు కూడ నగదు పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే సభ్యులు స్టేడియంలో వారి పేర్లను ఈ నెల 15తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటి సభ్యులు పర్వతనేని ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లుతో మాట్లాడుతున్న స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి

రైతులకు అగ్రి స్టాక్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతీ రైతు అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎన్రోల్మెంట్ ఐడి పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జి సాయి సింధు తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అగ్రి స్టాక్అ నేది రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు, సేవలను పొందడంలో సహాయకపడే వ్యవస్థ అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్. తదితర పథకాలు, రాయితీలు అందాలి అంటే తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు తెలిపారు. రైతులు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను చేస్తున్నారు కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ఆధార్ కి లింక్ అయినా ఫోన్ నెంబర్ తీసుకుని వెళ్లాలని అన్నారు. పొలం ఉన్న ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని అన్నారు.




పెనుగంచిప్రోలు తిరుపతమ్మ కల్యాణం

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య సమేత కళ్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ పీటలపై శ్రీ తిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరపున కొల్లా వెంకట చంద్రమౌళి దంపతులు గోపయ్య స్వామి వంశీకులు తరపున కాకాని వెంకట శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ఈవో కిషోర్ కుమార్, నందిగామ ఏసీబీ తిలక్ దంపతులు కల్యాణంలో కూర్చుని వేడుకలు జరిపించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త భారతీయం సత్యవాణి ప్రవచనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, రమా, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరావు, ఏఈలు రాజు, అరవిందు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం దుర్గగుడి ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి దేవస్థానం నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఆలయ వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, ఈఈ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, ప్రధానార్చకులు, వేదపండితులు మరియు వైదిక సిబ్బంది పాల్గొన్నారు.



బాషాకు పరామర్శ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె బాషా అమ్మమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆమె మరణించారు. భౌతికకాయాన్ని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ సందర్శించి నివాళుల ర్పించారు. బాషాను పరామర్శించిన వారిలో కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, పట్టణ కమిటీ సభ్యులు వి.మురళీమోహన్, ఎల్ పార్వతి, కె బేబీ సరోజిని, పార్టీ సభ్యులు కె నారాయణ, ఎన్ ప్రకాష్ ఉన్నారు.




పిల్లలకు సామాజిక బాధ్యత నేర్పాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: యూకేజీ విద్యార్థుల కాన్వకేషన్ డే మంగళవారం కొండపల్లి రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎస్సై ఫణీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు సామాజిక బాధ్యత నేర్పించాలని అన్నారు.పిల్లలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు సాంస్కతిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.అనంతరం ఎల్ కేజీ నుండి 1 తరగతి కి వచ్చే విద్యార్థులకు కాన్వేషన్ కార్యక్రమం నిర్వహించి సర్టిఫికెట్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొడాలి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులలో సజనాత్మకతను వెలిగితే చేసేందుకు రవీంద్ర భారతి పాఠశాల ఎప్పుడూ ముందు వరసలో ఉంటుందని,అకాడమిక్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పిల్లలు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆఫీసర్లు పసుపులేటి చైతన్య, కాడుకొండ శ్రీలత, క్యాంపస్ ఇంచార్జ్ భూషణం,ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపించాలని ప్రజాసంఘాల ప్రచారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పట్టణంలోని వివిధ పాఠశాలలు, సచివాలయాలు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే వ్యక్తి, ప్రజల కోసం పోరాటం చేసే వ్యక్తి కెఎస్ లక్ష్మణరావు అని, అధికారం ఉన్న లేకపోయినా కార్మికుల కోసం ఉద్యోగుల,


గంపలగూడెంలో...

కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం నిత్యం పోరాడే లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.నాగమణి, కోటా రవికుమార్, జె.వెంకటరావు, కె.శ్రీనివాస్, కాకనబోయిన వెంకటేశ్వరరావు, కె.రత్నబాబు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు తిరువూరు పట్టణంలో విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి లక్ష్మణరావును గెలిపించుకుంటే వచ్చే ప్రయోజనాలు, ప్రజా సమస్యలకు పరిష్కారాలను వివరిస్తూ ఓటును అభ్యర్థిస్తున్నాను. బుధవారం శ్రీవాహని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, మేకల నాగేంద్రప్రసాద్, కె.పాపారావు, పాకాల రామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, ఎం.చింతయ్య పి.లక్ష్మణరావు, ఎం.హరికృష్ణ, భారతకుమారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని జమ్మవరం, వెల్లంకి,


వీరులపాడులో...

కొణతాలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, రైతు సంఘం నాయకులు చాట్ల రవి, శోభన్‌బాబు, నంద్రు తిరుపతరావు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం: ప్రజా సంఘాల నాయకులు బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఓట్లు అడిగారు. ఈ కార్యక్రమంలో మద్దిరెడ్డి వెంకటరెడ్డి, గువ్వల సీతారాంరెడ్డి, ఎంజె చారి, మీసాల గోపాలకృష్ణ, మల్లవరపు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడు మృతి

సిఐటియు చొరవతో రూ.10 లక్షలు పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు డైమండ్ వ్యాలీ అపార్ట్మెంట్ ఐదో అంతస్తులో సెంట్రింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన ధర్మవరపు కష్ణ కుటుంబానికి సిఐటియు నాయకుల చొరవతో రూ.10 లక్షలు ఆర్థిక సహాయం చేయడానికి అపార్టుమెంట్ యాజమాన్యం అంగీకరించింది. సిఐటియు జిల్లా నాయకులు ఎం సోమేశ్వరరావు, రూరల్ మండల కార్యదర్శి పి వెంకటేశ్వరరావు ప్రమాదం జరిగిన డైమండ్ వ్యాలీ అపార్ట్మెంట్ వద్దకు చేరుకొని కృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనపై ఆరా తీసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణ శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం తెప్పలవలస పంచాయతీకి చిన్నపట్టణపేట చెందిన వాడు. బతుకుదేరువు కోసం ప్రస్తుతం విజయవాడ మధురనగర్ మధ్యకట్ట చిన్నవంతెన దగ్గర ఉంటున్నాడు. నగరంలోని భవన నిర్మాణ పనులకు వెళ్తుండేవాడు. వీరికి గౌతమ్, నందిని ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కష్ణ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో సిఐటియు నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలిచి పరిహారాన్ని



ఇప్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సోమేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి బాధిత కార్మికుల కుటుంబాలకు తగిన పరిహారం ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందని ఎన్నికల ముందు వరకు హామీనిచ్చిన సిఎం చంద్రబాబు ఈ ఘటన పట్ల స్పందించి, తగిన విధంగా సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కనకారావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-నందిగామ: శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రి జరిగాయి. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఈఓ గంగాధర్, ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవకుమార్, ఆలయ స్థానాచార్యులు ముదిగొండ శశాంక మౌళి ఆరాధ్య ఆలయ పురోహితులు సన్నిధానం కిషోర్ శర్మ తదితరులు పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా పారేపల్లి సాయి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పులిహార, మంచినీరు ప్యాకెట్లు, వాసవి క్లబ్ సభ్యులు జిలేబి, రోప్ స్టార్ సభ్యులు దద్దోజనం, ఫ్రెండ్స్ సర్కిల్ కట్టె పొంగలి పంపిణీ చేశారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి గ్రామ శివారు కృష్ణానది ప్రక్కన ఉన్న మామిడి తోటలో రేకుల షెడ్ లో ఒక గుర్తు తెలియని మగ మనిషి, ఫ్యాంట్ షర్ట్ ధరించి సుమారు 30 రోజుల క్రితం ఉరివేసుకొని చనిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని (అస్థిపంజరం) స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది ఇది ఇలా ఉండగా సుమారు ఒక సంవత్సరం క్రితం కూడా పక్కనే ఉన్న మామిడి తోటలో ఒక వ్యక్తి అస్తిపంజరం లభ్యమైంది. అదే ప్రదేశంలో తరుచూ ఈ ఘటనలు జరగడం పట్ల కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

విద్యార్థులకు ఎంపి అభినందన

ప్రజాశక్తి-విజయవాడ: జేఈఈ మెయిన్స్ ఫేజ్-1లో 99.8 శాతం పర్సంటైల్ అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విజయవాడకి చెందిన అన్ అకాడమి విద్యార్థులను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం అన్ అకాడమి సెంటర్ అకడమిక్ హెడ్ నమ్మి నాగేంద్ర ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ అత్యధిక మార్కులతో సత్తా చాటిన విద్యార్థులు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిశారు. విద్యార్థులను ఎంపి కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాజా రామకృష్ణ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

పరస్పర సహకారంతో సత్ఫలితాలు

జెవిఎస్ ట్రస్ట్ సభలో సీనియర్ జర్నలిస్ట్ వెంకట్రావు

విజయవాడ: ఏ రంగంలోనైనా పరస్పర సహకారంతో ముందుకు వెళితే సత్ఫలితాలను సాధించవచ్చని ప్రజాశక్తి పత్రిక మాజీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, సామాజికవేత్త ఎస్.వెంకట్రావు అన్నారు. బుధవారం గొల్లపూడిలోని జెవిఎస్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు పలు సూచనలు చేశారు. ఇప్పుడు అన్ని రంగాల్లో పోటీతత్వం పెరిగిపోయిందని ఆ స్థానంలో పరస్పర సహకారం అనే తత్వం అలవరచుకుంటే సమిష్టి అభివృద్ధికి అది చక్కని బాటలు వేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సోషలిజం ఆవశ్యకతను కూడా కొన్ని ఉదాహరణలతో వివరించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో ఓ సభ్యురాలిగా తానుకూడా పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ట్రస్టు ఏర్పాటు నేపథ్యాన్ని ట్రెజరర్ రామానంద్ ఓజా వివరించారు. ట్రస్ట్ ప్రతినిధి ఖాదర్ ఖాన్ సభకు అధ్యక్షత వహించగా మరో ప్రతినిధి డి.స్వాతి ట్రస్టులో జరుగుతున్న సేవా కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన అనేకమంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
గురువారం 13 ఫిబ్రవరి 2025

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

- కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ ఆఫీసర్ల దే కీలకపాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రులు నియోజవర్గం శాసనమండలికి ఈనెల 27వ తేదీన జిల్లాలో నిర్వహించే పోలింగ్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, తహసిల్దార్లకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ సెంటర్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డికె బాలాజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా సక్రమంగా నిర్వహిం చడంలో సెక్టర్ అధికారులతో పాటు పోలింగ్, ఇతర అధికారులు సిబ్బందిది కీలకమన్నారు. పూర్తిగా బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించే ఈ పోలింగ్ ఎన్నికల సంఘం నియమ నిబంధనలు, మార్గదర్శకాలను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఈవీఎంల ఎన్నికకు, బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించే ఎన్నికలకు వ్యత్యాసాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ఏ స్థాయిలోనూ తప్పులు జరగరాదన్నారు. పోలింగ్ నిర్వహణకు జిల్లాలో 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 191 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగ రిజర్వ్ బాక్స్ లతో కలిపి 250 బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచామన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ కే. చంద్రశేఖర రావు పోలింగ్ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సలకు వేసే సీల్, డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు.



గోపాలకష్ణ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల మరణించిన అవనిగడ్డ భవన నిర్మాణ కార్మికుడు రాజనాల గోపాలకష్ణ కుటుంబానికి అవనిగడ్డ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 8 వేల రూపాయల ఆర్థిక సహాయం బుధవారం యూనియన్ నాయకులు ఆ కుటుంబ వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాసం శ్రీనివాసరావు, అన్నపురెడ్డి నాగేశ్వరరావు, మాదాస్ కుమార్, బండారి నాగభూషణం, పెనుమూడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : అంకమ్మ తల్లి ఉత్సవాల మూడో రోజు అయిన బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బాపులపాడు మండలం బిళ్ళనపల్లి గ్రామంలో అంకమ్మ తల్లి వారి వార్షిక ఉత్సవాలు ముగింపు రోజైన బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా విదేశాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పాల పొంగళ్ళు నైవేద్యాలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల అర్చన, సుప్రభాతసేవ, అభిషేకాలు, నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కొండపావులూరి బాబురావు ఇంటి వద్ద నుంచి మేళతాళాల నడుమ అమ్మవారి నైవేద్యాలను ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం 1200 మందికి అన్న సమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబురావు, మోహన్ కుమార్, హేమంత్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో వీరపనేనిగూడెం బాలికల సత్తా



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినీలు

ప్రజాశక్తి-గన్నవరం : ఈ నెల 11 నుండి రెండు రోజుల పాటు అవనిగడ్డ ఉన్నత పాఠశాలలో జరిగిన కృష్ణా జిల్లా సెకండరీ పాఠశాలల క్రీడల సీనియర్ విభాగంలో బాలికల వాలీబాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు గన్నవరం మండలం వీరపనేనిగూడెం ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. జిల్లా నలు మూలల నుండి వచ్చిన జట్లతో పోటీ పడి వీరపనేనిగూడెం బాలికల జట్టు చక్కటి క్రీడా ప్రతిభ ప్రదర్శించడం తో ద్వితీయ స్థానం కైవసం చేసు కున్నట్లు వెంకటేశ్వరావు తెలిపారు. నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థిను లను ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయమ విద్య సహాయకులు సి. హెచ్. బాల కష్ణను ప్రధాన ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గన్నవరం జోన్ అధ్యక్ష,ఉపాధ్యక్ష, కార్యదర్శులు, పి. వెంకటేశ్వరావు, బి. యస్. రామ చంద్రుడు, యస్. వెంకటేశ్వరరావు, సలహాదారు యస్. సుబ్బారావు లు అభినందించారు.

ఆర్‌విఎస్ అను విద్యానికేతన్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్, తదితరులు

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం గంగూరు చేపల కుండీలు సెంటర్‌లో ఆర్‌విఎస్ అను విద్యానికేతన్ నూతన క్యాంపస్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య. ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, తాడిగడప మునిసిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు, క్యాంపస్ కరస్పాండెంట్ ప్రిన్సిపల్ రాజులపాటి ఆదిశేషు పాల్గొన్నారు.

28 లోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 28 లోపు పెన్షనర్లు ఫ్యామిలీ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను అవనిగడ్డ ఉపకజానా అధికారి కార్యాలయంలో కానీ సంబంధిత పోస్ట్ ఆఫీస్ లో కానీ లేదా నెట్ సెంటర్ లో గానీ సమర్పించాలని సబ్ ట్రెజరీ కార్యాలయం అధికారి పి ఆదిశేషు తెలిపారు. సకాలంలో లైవ్ సర్టిఫికెట్లు అందజేసి పెన్షన్లు పొందాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కళాకారులకు పింఛను అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు బి.రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేకంగా సంగీత విభావరి నిర్వహించారు. ఈ సంగీత విభావరిలో ప్రముఖ గాయని గాయకులు ఎ.సునీత, భానుమతి, మానస, టేకి నాగరాజు, శనగపాటి నాగేశ్వరరావు, ఆర్టీసీ శ్రీనివాసరావులు పాడిన పాటలు ప్రేక్షకులను అలరించారు. అనంతరం 20 మంది కళాకారులకు నెల వారి అందించే రూ.1000లు పింఛన్‌లను అందజేశారు. ఈ కార్యాక్రమంలో కళాకారుల సమాఖ్య అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ, కార్యదర్శి పి.ఎస్.బాబు సభ్యులు పాత శ్యాము, లోయ రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లి : తాడేపల్లి మండల ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తాడేపల్లి పట్టణ సిఐ కళ్యాణ్ రాజు చెప్పారు. రాజధానిలో కీలక ప్రాంతమైన తాడేపల్లిలోని పరిసర ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటు ద్వారా నిఘాను మరింత పటిష్టమని అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాలలో ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ఇప్పటికే ప్రజలలో పోలీసుల పట్ల గౌరవభావాలు పెంపొందించిన సీఐ కళ్యాణ్ రాజు ప్రజల భద్రతకు మరింత ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

71వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి : తమ సమస్యల పోరాటానికి ఐక్య పోరాటమే శరణ్యమని ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ప్రతిన బోనాలు. తమకు రావలసిన బకాయిల కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 71వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వై రమాదేవి, టి దుర్గాభవాని , ఈ సారమ్మ, ఎం శివకుమారి, ఎస్ కే ఇమాంబి కూర్చున్నారు. దీక్షలు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఐక్యత బలంగా ముందుకు సాగాలని కోరారు. మరింత పోరాట పటిమతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై యహెూశోవ, బి అంకయ్య, ఎం ఆశీర్వాదం, ఎస్.కె కాసిం, బి సూర్యప్రకాష్, ఎస్కే ఆరిఫ్, కే హగ్గయ్య, ఎన్ సుబ్బారావు, వై సులోచన, కే జి కే మూర్తి, లక్ష్మి, డి రమణ, ఎం సామ్రాజ్యం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

డ్రైవర్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి : ఆర్‌టిఓ



మాట్లాడుతున్న ఆర్‌టిఓ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : వాహనాలు నడిపేవారు విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆర్టీవో కే. వెంకటేశ్వ రరావు అన్నారు. బుధవారం గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వాహన పటుత్వ కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లా డుతూ రెగ్యులర్ గా వాహనాలను తనిఖీ చేయించి నట్లుగానే.. వాటిని నడిపేవారు విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గుండె, కంటి పరీక్షలు తప్పకుండా చేయించాలన్నారు. ఆరోగ్యం బాగుంటేనే సక్రమంగా నడపగలుగుతారని చెప్పారు. అందువల్ల రవాణా శాఖ ద్వారా డ్రైవర్లకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందవచ్చు అన్నారు. 70 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. అదే విధంగా సంధ్య కంటి ఆసుపత్రి వారు కార్మికులకు కంటి పరీక్షలు పందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు గోపాలకష్ణ ఎంబీఐలు వై. నాగేశ్వరరావు, మూర్తి, శివరాం గౌడ్, ఉదయ శివప్రసాద్, డివి రమణ, ఎండి అలీ, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పంటల సాగు వ్యయాన్ని తగ్గించి, అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయాలు పొందాలనే లక్ష్యంతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ జగ్గయ్యపేట మండలంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో పలు అభివద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందులో భాగంగా అనుమంచిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు, ఉపయోగిస్తున్న ఎరువులు, వాటి లభ్యత తదితర వివరాలను రైతులను అడిగారు. రోజువారీ వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరాలేంటో తెలుసుకున్నారు. వ్యవసాయ యంత్ర పరికరాల అవసరాన్ని, కోతుల బెడద గురించి రైతులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులు తాము సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించేలా రైతులు ప్రకతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అగ్రీ కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి ఇప్పటినుంచే పంటలు, నేలలు, భూసారం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.


కార్మికునితో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పూర్తిస్థాయిలో పనిచేసేలా ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాలు

కలెక్టర్ లక్ష్మీశ జగ్గయ్యపేట మండలంలోని పోచంపల్లి గ్రామంలోని ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) పరిశీలించారు. సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాలో 286 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 264 ఎస్‌డబ్ల్యూపీసీలను పూర్తిస్థాయిలో పనిచేసేలా చూస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రాలు లేని 22 గ్రామ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేసి, నిర్వహణలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ వర్మీ సీడింగ్ జరిగేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.కలెక్టర్ లక్ష్మీశ పోచంపల్లి గ్రామంలో డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన 2.5 కి.మీ. బీటీ రోడ్డును పరిశీలించారు. రోడ్లకు సంబంధించిన కొలతలు, రికార్డులను పరిశీలించారు. పర్యటనలో కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్ రమేష్, వ్యవసాయ శాఖ ఏడీ భవాని, మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి తదితరులున్నారు.

జెఇఇ మెయిన్స్‌లో కెవిఆర్ విద్యార్థుల ప్రతిభ

విజయవాడ: జెఇఇ మెయిన్స్ 2025 ఫలితాల్లో కెవిఆర్ కాలేజ్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని చైర్మన్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కెవిఆర్ మాట్లాడుతూ పి.నవదీప్ అత్యధికంగా 98.90 శాతం, ఎం.లోకేష్ 95.49 శాతం సాధించారని తెలిపారు. జెఇఇ మెయిన్స్ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే కెవిఆర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, అందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ టి.అనూష మాట్లాడుతూ నవదీప్, లోకేష్ అత్యధిక శాతం మార్కులు సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వెంకట దుర్గారావు, కాలేజ్ యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


లోకేష్


నవదీప్

వేపలవాగు పరిసరాల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని వేపలవాగు పరిసర ప్రాంతాలను మున్సిపల్ కౌన్సిలర్, వైసిపి జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షులు వట్టెం మనోహర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలోని 2, 5, 6, 7, 9వ వార్డుల పరిధిలో ప్రవహిస్తున్న వేపల వాగు పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. స్థానిక ప్రజలు దోమల బెడదతో అనేక ఇబ్బందులు పడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా వేపల వాగుకు వరద నీరు చేరడంతో ఈ ప్రాంత ప్రజల ఇళ్లలోకి వరద నీరు చేరి ఆస్తి నష్టం జరిగిందన్నారు. తాను స్థానిక 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేపల వాగు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, మున్సిపల్ డిఈలకు వినతిపత్రం అందజేశారు.

కోళ్లు తరలించకుండా చెక్‌పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: బర్డ్‌ఫ్లూ కారణంగా తెలంగాణ నుండి కోళ్ల లోడుతో వస్తున్న లారీలు ఎపిలోకి రాకుండా మండలంలోనిగరికపాడు వద్ద 65 నెంబర్ జాతీయ రహదారి వద్ద చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. కోళ్ల వ్యాన్లను ఉద్యోగులు అడ్డుకుని వెనక్కి పంపుతున్నారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

విజయవాడ: కంకిపాడులోని బివిఆర్‌నగర్‌లో క్లస్టర్ లెవెల్ లోకల్ యాక్షన్ కమిటీ ఫెడరేషన్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ సెంటర్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎమ్‌డి వసంతకుమారి మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె శ్రావణ్‌కుమార్, హామీక, మేరీ, పెద్దింట్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



ప్రజాశక్తి-మైలవరం: చదువుతో పాటు సమాజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలంటే అందుకు క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ లక్కీ రెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇ ల్లా రవి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థిని విద్యార్థులు జి కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామాన్ని సందర్శించారు. విద్యార్థులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగు, దిగుబడులు, అమ్మకాల గురించి రైతులని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న శిల్పారామంలో వివిధ శిలల పుట్టుక, శిల్పాకతి పొందే విధానం, అందుకు ఉపయోగించే పనిముట్లు, రవాణా విధానం గురించి తెలుసుకున్నారు. బ్రిక్స్ యూనిట్ ను సందర్శించారు. రోడ్ల వెంబడి పడవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు సేకరించి శుభ్రం చేశారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత అక్షరాస్యత ఆవశ్యకతను తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు నిండా దేవానంద్ కుమార్ పాల్గొన్నారు.



మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలంలో కొత్తపేట, చెవిటికల్లు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంట నమోదు అవశ్యకత, సబ్సిడీ పై అందుబాటులో ఉన్న కిసాన్ డ్రోన్ గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు చేయటం జరుగుతుందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, విద్యార్థులు, రైతులతో కలిసి మొక్కజొన్న పొలం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి నీలిమ, వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రుచి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చినపల్లి, మద్దులపర్వ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట 11 అంకెలు ఉండే విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తుందని తెలిపారు. ఈ నెంబరు ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. అనంతరం గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పవన్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఝాన్సీ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ 24 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పట్టణంలో నిత్యాహస్థితిలో ఉన్న ప్రజలకు, 150 మంది వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ఉన్న భవిత దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టాటా లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ అసోసియేట్ లీడర్ ఇనుపనుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ టాటా ఏఐ లైఫ్ ఇన్సూరెన్స్ 24 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భవిత దివ్యాంగుల పాఠశాలలో ఈ కార్యక్రమం చేయడం, పిల్లలతో మాట్లాడి వారి టాలెంట్ ని చూసినప్పుడు చాలా సంతోషం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ తోకల కిరణ్‌కుమార్, బిజినెస్ అసోసియేట్ లీడర్ ఇనుపనుర్తి శ్రీనివాసరావు, పెంటి శ్రీనివాసరావు, కుక్కల సుదర్శన్, ఏపీఎంపీఎ యూనియన్ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్, ఏపీఎంపీఎ ప్రధాన కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాష్, భవిత సెంటర్ సహిత విద్యా వనరుల ఉపాధ్యాయురాలు డి.ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



18న వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సంయుక్తంగా ఈ నెల 18న ఘంటసాలలో వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గరికపాడు డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అచ్యుతరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచారం, నూతన వంగడాల ప్రదర్శన వాటి గురించి సమాచారం అందిస్తారని తెలిపారు.

హెల్త్ సెంటర్లో గుండెనొప్పికి చికిత్స : గార్గేయ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ఏరియా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండె నొప్పితో వచ్చిన ముగ్గురు రోగులకు అత్యంత ఖరీదైన ఇంజక్షన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ గార్గేయ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.40 వేలు విలువైన ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. గుండెపోటు వచ్చిన వారు గంట ముందు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వారి ప్రాణాన్ని కాపాడటానికి 40 వేల రూపాయలు ఖరీదు చేసే ఇంజక్షన్ ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడ వంటి పెద్ద ఆసుపత్రులకు పంపుతున్నామన్నా రు. ఇప్పటికి ఆసుపత్రి కి వచ్చిన ముగ్గురికి ఇంజక్షన్ ఇచ్చి విజయవాడకు తరలించగా వారు క్షేమంగా తిరిగి వచ్చారని పేర్కొన్నారు. ఈప్రాంత ప్రజల ప్రభుత్వ ఆసుపత్రిలో లభించే సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-వీరులపాడు: జుజ్జూరు గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద తడి, పొడి చెత్తపై అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామావత్ కోటి, సీతారామరాజు, రామావతు రాము, కానూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.